## క్లుప్తంగా

### బదిలీపై వెళ్తున్న ముగ్గురు జడ్జిలకు సత్కారం



నగరంపాలెం: మూడేళ్లు సమర్థంగా విధులు నిర్వర్తించి, న్యాయమైన తీర్పులను వెలువరించారని జిల్లా జడ్జి పార్థసారథి అన్నారు. ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పొన్నూరు బుజ్జి విజయనగరం జిల్లాకు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతి ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్‌ను విజయవాడకు బదిలీయ్యారు. ఈ మేరకు ఆ ముగ్గురు జడ్జిలను శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. సత్కార సభకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీవీ గౌరీశంకర్ అధ్యక్షత వహించగా, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, రాజేష్, లక్ష్మి, పాలడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీసాయి కళాశాల వార్షికోత్సవం



నగరంపాలెం: ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని శ్రీసాయి రాగ సంగీత కళాశాల తృతీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి అధ్యక్షత వహించారు. శిష్యులు అన్నమయ్య కీర్తనలు, భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, లీలైట్స్ అధినేత ఉన్నం శ్రీనివాసరావులను సత్కరించారు. జి.నాగసాయి, పి.వి.రమణ, టి.ఈశ్వర్ వాయిద్య సహకారం అందించారు. పమిడికుమార్ శేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

### రెల్లి కులస్తులు సీట్ల కేటాయింపులో పవన్‌కు గుర్తుకు రాలేదా!

నెహ్రూనగర్: తాను రెల్లి కులాన్ని స్వీకరించాను అంటూ బహిరంగ సభల్లో డబ్బా కొట్టుకునే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సీట్లు కేటాయించే సమయంలో మాత్రం రెల్లి కులస్తులు గుర్తు రాలేదా అని రెల్లి సంక్షేమ సంఘం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ యలమంచిలి సామ్రాజ్యం ప్రశ్నించారు. శనివారం పాత గుంటూరులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిరంతరం సేవలందిస్తూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న తమ జీవితాలలో మాత్రం మార్పు రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు తమను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని.. తమ కులానికి అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించిన పార్టీకి తమ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు.

### విద్యార్థులకు విద్యా ప్రగతి పత్రాలు అందజేత

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థులకు విద్యా ప్రగతి పత్రాలను అందజేసినట్లు జైన్ హైస్కూల్ డైరెక్టర్ ఎండీ మున్ను తెలిపారు. శనివారం సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లలకు సంబంధించిన వార్షిక ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ పర్యవేక్షించారు.

### భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: పెయింటింగ్ కార్మికుడు భవనంపై నుంచి కింద పడి మృతిచెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నంబూరుకు చెందిన కృష్ణ(51) అరండల్‌పేట 6వలైనులో ఓ భవనంపై పెయింట్ వేస్తూ ఐదో అంతస్తు నుంచి కిందపడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# అభివృద్ధి, సంక్షేమంతో పేదలకు మేలు

**వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా**



పార్టీలో చేరిన వారితో నూరిఫాతిమా

పట్నంబజారు: పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 3వ డివిజన్ బాలాజీ నగర్, 14వ డివిజన్ వర్కర్స్ కాలనీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సారథ్యంలోనే ప్రభుత్వం ప్రజలకు చేయగలిగే మంచి పనులతోనే మేనిఫెస్టో రూపొందించినట్లు చెప్పారు. టీడీపీ హయాంలో రూ.వెయ్యి ఉన్న పింఛన్‌ను రూ.3 వేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కుతోందని చెప్పారు. అవ్వాతాతలకు మరింత ఉత్తమిచ్చేలా రూ.3,500 చేస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగనన్న మేనిఫెస్టో ప్రకటనతో పేద వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి ద్వారా ఇప్పటి వరకు ఇస్తున్న రూ.15 వేల నుంచి రూ.17 వేలు చేయటంతో పాటు, గడప వద్దకే డాక్టర్లను పంపి మెరుగైన వైద్యం అందిస్తున్న ఆరోగ్యశ్రీని మరింత విస్తరణ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనేక సంక్షేమ పథకాలకు ఇంకా మెరుగ్గా రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు.

వైఎస్సార్ కాపు నేస్తం రూ.60 వేల నుంచి రూ.1లక్ష 20 వేలకు పెంపు, ఈబీసీ నేస్తం రూ.45 వేల నుంచి రూ.లక్ష 5 వేలకు పెంపు, సున్నా వడ్డీకే రుణాలతో పాటు అనేక పథకాలను ప్రజల కోసం ప్రవేశపెట్టిన వైఎస్ జగనన్న ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. తూర్పు నియోజకవర్గంలో తమ ఇంటి బిడ్డగా నిలబడుతున్న తనని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, నాగేశ్వరరావు, సాదం కోటేశ్వరరావు, అంకమ్మరావు, కృష్ణ పాల్గొన్నారు.

**12వ డివిజన్ నుంచి..**

వైఎస్సార్ సీపీ మహిళా నేత కుమారి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 12వ డివిజన్ ముఫ్తీబజారుకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సలీం, అప్సర్, హన్ను తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో అంజాద్, ఇమ్రాన్, బబ్లూ, నిజాం, షకీర్, బాషి, సయ్యద్‌బాబు, జానీబాషా, హబీబుల్లాఖాన్, యాసీన్, ఫారూక్, ఖాజా, ఫజల్, కరిముల్లా పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధికి ఆయా పార్టీలకు చెందిన నేతలు వైఎస్సార్ సీపీకి ఆకర్షితులవుతున్నారని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో శనివారం 11వ డివిజన్‌కు చెందిన షేక్ ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సమీవుల్లా ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో పలు పార్టీలకు చెందిన నేతలు చేరారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ అధిష్టానం సీఎం వైఎస్ జగన్‌ను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. అయినా ప్రజల కోసం ఎంత కష్టాన్నైనా ఎదుర్కొని ముందుకు సాగారన్నారు. పార్టీలోచేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తన కుమార్తె నూరిఫాతిమాను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలు, ఆశయాల కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకడుగు వేయని మనస్తత్వం సీఎం జగనన్నదేనన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మొహమ్మద్ ఇబ్రహీం, రఫీ, అఫ్రోజ్, సత్తార్, అబ్బాస్, వసీమ్, ముజీబ్ పాల్గొన్నారు.

## నేడు ఆక్స్‌ఫర్డ్ ప్రతిభా పురస్కార మహోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ- జేఈఈ, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కార మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 570కి పైగా మా ర్కులు సాధించిన విద్యార్థులు ఉదయం 10 గంటలకు చంద్రమౌళీనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఉన్న ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ-జేఈఈ, నీట్ అకాడమీలో హాజరై ప్రతిభా పురస్కారాన్ని అందుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట టెన్త్ మార్కుల జాబితా తీసుకుని రావాలని తెలిపారు. వివరాలకు 9177447924, 9959703265లో సంప్రదించాలని సూచించారు.

# వడ దెబ్బ బాధితుల కోసం ప్రత్యేక ఐసీయూ వార్డు

**సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్**

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో వడ దెబ్బ బాధితుల కోసం ప్రత్యేక జనరల్ మెడిసిన్ ఐసీయూ వార్డును కేటాయించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరు పడకల వార్డును శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వడగాడ్పులు తీవ్రతకు గురైన బాధితుల కోసం ప్రత్యేక వార్డును కేటాయించినట్లు చెప్పారు. వడ దెబ్బకు గురైన బాధితులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వడ దెబ్బకు గురైన వారికి ఎక్కువగా తలనొప్పి, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. శరీరం కూడా ఎరగ్రా మారుతుందని వివరించారు. శ్వాస పీల్చుకోవడం కష్టంగా ఉంటుందని అలాంటి వారు చల్లని ప్రదేశంలోకి వెళ్లాలని అయన సూచించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వడ దెబ్బకు గురవుతారని చెప్పారు. అలాంటి వారికి ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య సదుపాయాలను అందిస్తామని తెలిపారు. అత్యవసర చికిత్స విభాగానికి రాగానే వారికీ ప్రథమ చికిత్స అందించి అనంతరం వార్డుకు తరలిస్తారని పేర్కొన్నారు. బాధితులు జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ముఖ్యంగా వడ దెబ్బకు గురైన వారు చల్లని నీరు తాగాలని, సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం సమయంలో రోడ్డుపై తిరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో వడ దెబ్బకు గురైన వారికి ప్రత్యేక వైద్యం అందిస్తారని తెలిపారు. డీఎంఈ డాక్టర్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక వార్డును కేటాయించినట్లు తెలిపారు.

## 11 మందికి ప్రైవేట్ ఉద్యోగాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం (జేకేసీ) ఆధ్వర్యంలో శనివారం భాష్యం విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 11 మంది ఎంపికయ్యారు. ఇంటర్వ్యూలకు హాజరైన 16 మంది అభ్యర్థులకు వ్యక్తిగత ఇంటర్వ్యూ అనంతరం 11 మందిని ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక చేశారు. ఇంటర్వ్యూలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్‌ఖాన్, కె.అపర్ణ పర్యవేక్షించారు.

## విత్తనోత్పత్తిపై మరింత కృషి జరగాలి

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని లాం ఫాం నందు శనివారం కృష్ణ మండలం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ బి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గతేడాది పరిశోధన స్థానాలు, కేవీకేలు, ఏరువాక కేంద్రాల్లో నిర్వహించిన పరిశోధనలు, ప్రగతి, విస్తరణ కార్యక్రమాలను ఏడీఆర్ వివరించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులను పంటలు తట్టుకునే విధంగా రైతులకు విస్తృతంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలన్నారు. విత్తనోత్పత్తిపై మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ ఆధారిత సలహాలు, సూచనలకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. డీడీఏ బాలు నాయక్ మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. 20 జిల్లాల్లో నాలుగు పంట ఉత్పత్తులను డిజిటల్ ప్లాట్‌ఫాంలో విక్రయించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులు జిల్లాల వారీగా పంటల విస్తీర్ణం, క్షేత్రస్థాయి సమస్యలు, వివిధ పంటల్లో మినిట్లు ఫలితాలను తెలిపారు. పంటల ప్రధాన శాస్త్రవేత్తలు వివిధ పంటల్లో నూతన శాస్త్ర పరిజ్ఞానాన్ని తెలియజేస్తూ రైతుల సమస్యలకు పరిష్కారాలు చూపారు. రానున్న ఏడాదిలో చేపట్టాల్సిన పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాల కార్యాచరణపై చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు.

## విద్యతో పాటు విలువలు అలవర్చాలి

**విశ్రాంత జిల్లా న్యాయమూర్తి వెంకట రమణ రాయలు**



వెంకట రమణ రాయలును సత్కరిస్తున్న మాజేటి ప్రసాద్, హేమాంబ, ఉషశ్రీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే విద్యతో పాటు విలువలు అలవర్చాలని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి పి.వెంకట రమణ రాయలు పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట రమణ రాయలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలని కోరారు. విద్యార్థులు సంప్రదాయ నృత్య, నాట్య, నాటక ప్రదర్శనలతో పాటు ఏకపాత్రాభినయం, సంగీత వాయిద్యాలతో తమలోని నైపుణ్యాలను ప్రదర్శిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి పీఆర్కే గోపాలరావు, కోశాధికారి మాజేటి ప్రసాద్, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్ఎం ఉషశ్రీ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవం



వేదికపై జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శనివారం అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు కొనసాగాయి. శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలను నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పలు రాష్ట్రాల నృత్య కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ప్రముఖ ఆంధ్ర నాట్య కళాకారుడు సంజయ్ వాడపల్లిని అక్కిరాజు మనీప్రియ స్మారక సాత్రాజితి పురస్కారంతో, భరత నాట్య కళాకారుడు మోన్ జిత్‌షా(కలకత్తా), కూచిపూడి నృత్య కళాకారిణి మధువతి కులకర్ణి (బెంగళూరు)లను యువ కళారత్న పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రముఖ కవి, చిత్రకారుడు అక్కిరాజు శ్రీహరిబాబు, సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, ఎర్రగుంట ప్రశాంతి పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశం

గుంటూరు మెడికల్: ఆర్ఎంపీ, పీఎంపీ కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం శనివారం స్థానిక జాకీర్ హుస్సేన్‌నగర్‌లో నిర్వహించారు. సమావేశంలో బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి మొహమ్మద్ నసీర్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ స్పెషాలిటీ నిపుణురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ పాల్గొన్నారు.




